కవితా కౌముది

# Oh..గాడ్! మా ఆవిడ

భువనచంద్ర

మా ఆవిడ.. డిగ్రీలేని మేధావి
మెడిసిన్ చదవని డాక్టరు
ఇల్లు కట్టని మేస్త్రి
మంత్రం తెలియని శాస్త్రి
చెబుతుంది ఎప్పుడేం చెయ్యాలో
బోధిస్తుంది ఎక్కడెలా వుండాలో
ఏమాటికామాట చెప్పొద్దూ...
నా బుర్రలో లేనే లేదంటుంది..గుజ్జు.
అవునంటే పంట.. కాదంటే తంటా,
యీ లోకంలో ఆవిడకి.. ఎదురే లేదంటా.
మహ  మహా తెలివైనవాడినని  నేనంటే మరి మా అమ్మకి
ముద్దు..
ఏ ఇంటోవున్నా ఎవరెదుటున్నా.. లేదోయ్ మా ఆవిడకి
హద్దు.
ఏ టాపిక్ ఎత్తినా...లెక్చర్ దంచేస్తుంది
నీ మాటలు తప్పంటే.. ఎగబడి సాధిస్తుందీ
రామపాదములు తాకిన రాయిపడతిగా మారే
పత్ని పదవి కెగబాకిన.. నాతే కోతిక మారే.

.
క్షణానికో మాట మార్పు.. గడియ కొక్క అదిలింపూ
వెటకారం వెక్కిరింపు. అదేమంటే ఇకిలింపు.
ఏమిట్రా యీగోలని Godని కన్సల్ట్ చేశా
అప్పుడతను చెప్పాడు... అసలు గుట్టు విప్పాడు.
ఓరి పిచ్చి మానవుడా.. నాకన్నా నువు బెటరోయ్
ఆఫీసులో పనివుందనో.. అవసర మీటింగుందనో
కరెంట్ బిల్లు కట్టాలనో.. వెజిటబుల్స్ తేవాలనో
ఏదో ఓ వంక పెట్టి - వైఫుకి దూరంగుంటావ్.
రోజుకి పదిగంటలైన.. హేపీగా బ్రతికేస్తావ్
నాకెక్కడిదా ఛాన్సూ.. మధురోహలతో రొమాన్సు
ఇరవైనాలుగ్గంటలు .. నా పక్కనె ఉంటుందోయ్.
తలచుట్టూ కళ్ళెట్టుకు.. కావలికాస్తుంటుందోయ్.
అందుకనే అపుడపుడూ.. అవతారం ధరియిస్తా
భూలోకానికి వచ్చి.. జాలీగా గడిపేస్తా
పెళ్ళయిన మగవాళ్ళకి యీ నరకం తప్పదోయ్
సతివుండే హెవెనుకన్న...హెల్లే యమగొప్పదోయ్
అంటూ ఎస్కేపయ్యా... డా  దేముడుగారు..
నిస్పృహతో నిట్టూర్చా.. డీ జీవుడుగారు..

★★★



# కూడలి

అశోక్ అవారి





నాల్గు పూరేకుల తొవ్వలను
తామరదుద్దులా కలిపి
సామాన్యున్ని
జాగృతపరిచే నిత్యచైతన్య స్థలం..!
కార్మికుల
శ్రమదోపిడికి ఎర్రమందారాలై
కార్పోరేట్ దొష్టికాలపై
పిడికిలెత్తే రణరంగ భూమి..!
పుడమితల్లి బిడ్డలు
గిట్టుబాటు ధరకై
దళారీల దిష్టిబొమ్మకు
కర్మకాండలు జరిపే ధర్మస్థానం..!
ఆగమన నిష్క్రమణల
చిరునామై
ఎడదలో నవ్వులు పూయించే
భవబంధాల ఆలింగనపు చోటు..!
నాయకుని
నరం లేని నాలుకిచ్చే వరాలకు
పాలకపక్షం
పాలాభిషేకాలు చేసే రేవు..!
హక్కులు
కర్కశంగా కాలరాయబడినప్పుడు
నినాదమై గర్జించి
రాజ్యం మెడలువంచే యుద్ధ క్షేత్రం..!
కూడళ్ళన్నీ ఒక్కటై
ఒక్కసారి కూడబల్కున్నాయనుకో !
ఫాసిజం తాతల పునాదులైనా
కూకటి వేళ్ళతో పెకలాల్సిందే !!

★★★

# మొగ్గలు
## డా.భీంపల్లి శ్రీకాంత్

గాయాలను నిత్యం ముద్దాడుతూనే ఉంటాను
అనుభవాల గేయాలను ఆవిష్కరించడానికి,
రాపిడి పడితేనే మనిషి వజ్రంలా మెరిసేది

నిశీథిని ఆలింగనం చేసుకుంటూనే ఉంటాను
ఒంటరి జీవితాన్ని సదా అనుభవించడానికి,
చీకటిలోనే వెలుగు రవికిరణమై వెలిగొందేది

ఒంటరితనాన్ని నిత్యం అనుభవిస్తూనే ఉంటాను
గాయపడ్డ హృదయాన్ని లేపనమై ఓదార్చడానికి,
గాయపడితేనే మనిషి గేయమై ప్రభవించేది

జీవితపోరాటాన్ని నిత్యం సాగిస్తూనే ఉంటాను
బతుకుబాటలో పద్మవ్యూహాన్ని ఛేదించడానికి,
అలుపెరుగని పోరాటం మనిషి అస్తిత్వగానం

ఓటమిని కెరటంలా ఆహ్వానిస్తూనే ఉంటాను
అపజయాల ఆటుపోట్లను గెలపొందడానికి,
ఓటమి విజయాన్ని ముద్దాడే తొలిమెట్టు

★★★



# వలయం
## బాలాజీ పంజా

తిరిగి తిరిగి అక్కడికే వస్తాం
ఎక్కడికి పోయినా తిరిగి ఇంటికే
ఎన్ని దేశాలు తిరిగినా కన్న దేశానికే
ఎంత ఎదిగినా అమ్మ ఒడికే
ఎంత ఎగిరినా నేల మీదికే !
కొండల్లోంచి నదుల్లోకి
నదుల్లోంచి సముద్రంలోకి
సముద్రం లోంచి మేఘాల్లోకి
మేఘాల్లోంచి కొండల్లోకి
మళ్ళీ అదే కొండల్లోకి !
నిన్న నుంచి నేటికి
నేటి నుంచి రేపటికి
రేపు మళ్ళీ నిన్నగా మారే వరకే
కథ కంచికి
మన మింటికి
'అనగనగా' కథ మళ్ళీ మొదలయ్యే వరకే!
చేసిందే చేస్తూ ఉంటాం
చేసి చేసి మారుస్తుంటాం
మార్పు మారుతూ ఉంటే
మళ్ళీ మొదటికే వస్తాం
ఎక్కడికో పోయామనుకుని ఎప్పటికో తెలుసుకుంటాం
మొదలెట్టిన చోటికే రావాలని.

గుండ్రంగా తిరిగే భూమ్మీద నుంచి
ఏ రాకెట్టూ నిటారుగా పోదు. పోలేదు.

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

పృథివి యెల్లలు దాటిన ప్రేమ యిద్ది
ఉన్నతము పర్వతమ్ముల కన్ననిద్ది
కానలందున నిల్చు వృక్షముల కన్న
మిక్కుటమ్మైన యోర్పు ప్రేమికులదెపుడు

కలసినపుడు మది శిఖరాగ్రమును చేరు
విడినయపుడెడారి వలె జీవితము తోచు
పచ్చని బ్రతుకు సతతము పంచుకొన్న
జీవితము తోచు పచ్చని చేను వోలె

ఎడతెగక కురిసిన వాననెర్రమట్టి
కలసినవి కలసిన మనస్సుల విధాన
వివిధరీతుల బరగునీ పృథివి తలము
పలువిధమ్ముల జను ప్రేమబంధమట్లు

విరుల తోటలో తిరుగాడి పరవశించి
రాగముప్పొంగ నదుల తీరముల నడచి
పుడమి యంచు తాకిన యనుభూతి పొంది
బడలికను వీడ పచ్చిక బయలు చాలు

మణులు గలవిట స్వర్ణమ్ము మట్టి గలదు
విరులు తరులును ఝురులును గిరులు కలవు
నడచు జీవులు గలరిట, నడక వీడి
పదిలముగ నిల నిద్రించు వారు గలరు



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS